కేవ్లానాయక్‌కు నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు

కేవ్లానాయక్(ఫైల్)

## శంకర్‌నాయక్‌కు ఎర్రబెల్లి పరామర్శ

రాయపర్తి, సెప్టెంబర్ 21: మండలంలోని ఊకల్ పరిధి బాలాజీతండాలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్(102) శనివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శంకర్‌నాయక్, సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులు తండాకు చేరుకున్నారు. అలాగే, కేవ్లానాయక్ మరణవార్త విన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాలాజీ తండాకు చేరుకుని కేవ్లానాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎర్రబెల్లి వెంట నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, బొడ్డు రంగయ్య, చందు రామ్‌యాదవ్, పాము మనోహర్, బండపల్లి వెంకటయ్య, బాబూనాయక్ ఉన్నారు. అలాగే, కేవ్లానాయక్ కుటుంబాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పరామర్శించారు.

సిబ్బందితో కలిసి మొక్కలు నాటిన ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

## ప్రజాహితమే పోలీసుల అభిమతం

- ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి
- ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: ప్రజాహితమే పోలీసుల అభిమతమని, ఆ దిశగా ప్రతి పోలీస్ పని చేయాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఈస్ట్‌జోన్ డీసీపీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అలాగే, పోలీసులతో పరేడ్ చేయించారు. ప్రతి రోజు పరేడ్‌తోపాటు యోగా, వాకింగ్, వ్యాయమం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది స్నేహసంబంధాలు కలిగి ఉండాలన్నారు. సన్నిహిత కౌంటర్ ద్వారా ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. అలాగే, లా అండ్ ఆర్డర్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### విశ్వకర్మ పరమేశ్వరులపై సందేశం

పర్వతగిరి, సెప్టెంబర్ 21: అమెరికాలో శనివారం వీకేఎఎన్ఏ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై చౌటపెల్లికి చెందిన డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వ సృష్టికర్త విరాట్ విశ్వకర్మ పరమేశ్వరుల విశిష్టతను వివరించారు. చౌటపెల్లిలో ఆవిర్భవించిన బతుకమ్మతల్లి కీర్తి విశ్వవ్యాప్తం అవుతున్న శుభతరుణంలో ఈ అవకాశం రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ We are Hiring PHARMACIST (B.Pharmacy/M.Pharmacy). Fresher/ Experienced, PCI Certificate Must.Receptionist with 1Year experience(Min)Anaesthesia Technician with 2 Year experience(Min) Send your Resume to koorapatiads@gmail.com for more information Cont: 7337222096.
NTW-000

★Doctor/Gynaecologist (DGO/MS), X-Ray Technician, Lab Technicians, PRO's, Staff Nurses, Receptionist to work in Multispeciality Hospital in Madikonda, Hanamkonda. Cell: 9951020366
NTW-314815

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

BUSINESS OFFER

★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు

- అధికారులు సర్వం సిద్ధం చేయాలి
- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- టార్పాలిన్లు, గన్నీబ్యాగులు, యంత్రాలను అందుబాటులో ఉంచాలి
- సమీక్షలో కలెక్టర్ సత్య శారద

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యా శారద

గిర్మాజీపేట, సెప్టెంబర్ 21: వానకాలం ధాన్యం కొనుగోళ్లకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఆమె వానకాలం ధాన్యం కొనుగోళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు, కొలతల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 వానకాలం ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలన్నారు. ఈ ఏడాదిలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు జిల్లావ్యాప్తంగా 203 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్స్, గన్నీబ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రైతుల వివరాలు అందించాలి**

జిల్లాలో ఈసారి సన్నరకం ధాన్యం ఎక్కువగా సాగు చేశారని, వ్యవసాయాధికారులు మండలాల వారీగా రైతుల వివరాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయాధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం.. కొనుగోలు కేంద్రాలను పెంచాలన్నారు. ఈ సీజన్‌లో ఏ-గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 2320, కామన్ రకం ధాన్యానికి రూ. 2300 ప్రభుత్వం ధర నిర్ణయించిందని చెప్పారు. సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకం ఇస్తున్నందున అన్ని కొనుగోలు కేంద్రాల్లో గ్రెయిన్ కాలిఫర్స్ (డయల్ మైక్రోమీటర్) అందుబాటులో ఉంచాలన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యం రాశులను వేర్వేరుగా నిల్వ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు కొనుగోలు ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, డీఎం సురేఖ, డీఆర్డీవో కౌసల్యాదేవి, డీసీవో నీరజ, డీఏవో అనురాధ, జిల్లా తూనికలు, కొలతల అధికారి రియాజ్, రైస్‌మిల్లర్లు, కాంట్రాక్టర్లు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రవీందర్‌రెడ్డి

### పత్తి పంట దిగుమతిపై సమీక్ష

కాశీబుగ్గ, సెప్టెంబర్ 21: దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో పత్తి పంట దిగుమతి, నాణ్యతపై ఆలిండియా కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం చర్చించారు. కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, మహారాష్ట్ర కాటన్ జిన్నర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఔరంగాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గతేడాది వచ్చిన పత్తి దిగుబడి, ఈ సంవత్సరం ఎంత వచ్చే దిగుబడిపై చర్చించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చల్లా ధర్మారెడ్డి

### బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ

గీసుగొండ, సెప్టెంబర్ 21: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ రెడ్డిపాలెంలో బీఆర్ఎస్ గ్రామ నాయకుడు కరుణాకర్ తండ్రి బుచ్చయ్య ఇటీవల మృతి చెందాడు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం మృతుడి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్ మనోహర్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, నాయకులు సుంకరి శివకుమార్, గోలి రాజయ్య ఉన్నారు.

ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న డీఏవో అనురాధ

### మహ్మదాపురం సొసైటీ తనిఖీ

దుగ్గొండి, సెప్టెంబర్ 21: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని డీఏవో అనురాధ అన్నారు. శనివారం ఆమె మహ్మదాపురం సొసైటీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే, ఎరువుల గోదామును పరిశీలించారు. కొరత లేకుండా రైతులకు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తిమ్మంపేటలో మిర్చి పంటను పరిశీలించారు. మిర్చి నారు నాటే సమయంలో రైతులు దుక్కిలో ఎకరాకు 8 కిలోల చొప్పున ట్రైకోడర్మ్‌ను చల్లుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏవో మాధవి, ఏఈవో హన్మంతు, రాజేశ్, రైతులు రవికుమార్, కొమురెల్లి, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

**రోడ్లపై మక్కలు ఆరబోయొద్దు : ఎస్సై వెంకటేశ్వర్లు**

దుగ్గొండి, సెప్టెంబర్ 21: గ్రామాల్లో రోడ్లపై మక్కలు, ధాన్యం, పెసర్లు వంటి వ్యవసాయ ఉత్పత్తులను ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ రహదారులపై పంట ఉత్పత్తులను ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మహిళల భాగస్వామ్యంతోనే విజయవంతం : ఎంపీవో**

రాయపర్తి, సెప్టెంబర్ 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు మహిళల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతాయని ఎంపీవో కూచన ప్రకాశ్ తెలిపారు. పెర్కవేడులోని మహిళా సంఘం భవనంలో శనివారం నిర్వహించిన గ్రామైక్య సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛతా హీ సేవా-2024పై అవగాహన కల్పించారు.

**మత్తు పదార్థాలకు బానిస కావొద్దు : సీఐ మల్లయ్య**

గిర్మాజీపేట, సెప్టెంబర్ 21: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, అక్రమంగా రవాణా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య హెచ్చరించారు. శనివారం ఆయన మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.

**విద్యార్థులు మొబైల్స్ వినియోగించొద్దు : ఎస్సై మహేందర్**

నెక్కొండ, సెప్టెంబర్ 21: విద్యార్థులు మొబైల్స్ వినియోగించొద్దని, పిల్లలు వినియోగిస్తున్న సెల్‌ఫోన్స్, సామాజిక మాధ్యమాలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని నెక్కొండ ఎస్సై మహేందర్ సూచించారు. మండలంలోని పెద్దకోర్పోలు కేజీబీవీలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో గురుకుల ప్రత్యేక అధికారి బి.రజిత, ఉపాధ్యాయులు సరిత, సుని, రజిత పాల్గొన్నారు.

**నేడు లేబర్ కార్డుదారులకు ఉచిత వైద్య పరీక్షలు**

నర్సంపేట, సెప్టెంబర్ 21: పట్టణంలోని లేబర్ కార్డుదారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం, బొందబడి, సర్వాపురం మూడు సెంటర్లలో వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్డుదారులు వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల నుంచి అర్జీలు తీసుకుంటున్న బృందం సభ్యులు

## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం చైర్మన్
- రాయపర్తిలో విద్యుత్ లోక్ అదాలత్

రాయపర్తి, సెప్టెంబర్ 21: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి టీజీఎన్‌పీడీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక-1 వరంగల్ పని చేస్తున్నదని ఆ సంస్థ వినియోగదారుల గ్రీవెన్స్ రెడ్రసల్ ఫోరం-1 చైర్మన్ ఎన్‌వీ వేణు గోపాలచారి అన్నారు. శనివారం వర్ధన్నపేట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని రాయపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషన్ సభ్యులు రమేశ్, కె.రమేశ్, ఆర్.చరణ్‌దాస్‌తో కలిసి విద్యుత్ వినియోగదారుల నుంచి ఆర్జీలు స్వీకరించారు. సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా ఆధారాలతో అందజేస్తే వెంటనే పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉన్నతాధికారులు ఎం.రాములునాయక్, మధుసూదన్‌రావు, భిక్షపతి, కన్నరాజు, సంజీవరావు, రాయపర్తి, మైలారం సెక్షన్ల ఏఈలు పెద్ది రవళిరెడ్డి, కాసం నిఖిల్‌కుమార్, తరుణ్‌కుమార్, ఫోర్‌మెన్లు తుమ్మ సుదర్శన్‌రెడ్డి, వెంకన్న, ఎనగందుల ప్రవీణ్ కుమార్, మహేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కేఎంసీలో హెల్త్‌రన్‌ను ప్రారంభిస్తున్న సీఐ సతీశ్

## కేఎంసీలో ఉత్కర్ష-24 ప్రారంభం

వరంగల్‌చౌరస్తా, సెప్టెంబర్ 21: కాకతీయ మెడికల్ కళాశాలలో ఉత్కర్ష-24 వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని వారం రోజులపాటు నిర్వహించనున్నారు. మొదటి రోజు నిత్య జీవితంలో వ్యాయామం అవసరమనే విషయాన్ని గుర్తు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేఎంసీ నుంచి పబ్లిక్ గార్డెన్స్ వరకు హెల్త్‌రన్ నిర్వహించారు. అనంతరం హెడ్‌క్వార్టర్స్ జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనుమకొండ సీఐ సతీశ్ హాజరయ్యారు. రెండో రోజు క్రీడా పోటీలు, మూడో రోజు షార్ట్‌ఫిల్మ్స్ ఫెస్టివల్, నాలుగో రోజు రక్తదానం, కార్నివాల్ నైట్, ఐదో రోజు సంప్రదాయ దినోత్సవం, దాండియా, ఆరో రోజు ట్రెజర్ హంట్, ఈడీఎం నైట్, ఏడో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆకేరువాగు చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు

మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 21: కోతకు గురై నీరంతా వృథాగా పోతున్న ఆకేరువాగు చెక్‌డ్యామ్‌కు శనివారం మరమ్మతులు ప్రారంభించారు. పట్టణ సమీపంలోని ఆకేరువాగు చెక్‌డ్యామ్ భారీ వర్షాలకు కోతకు గురవుతున్నది. ఈ క్రమంలో ఏటా తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారు. గత ఏడాది తాత్కాలిక మరమ్మతులు చేసినా భారీ వర్షాలకు ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయి. దీంతో ప్రస్తుత వర్షాకాలంలో వాగులో ఉన్న నీరంతా వృథాగా పోతున్నది. ఈ విషయమై పలు మార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతోపాటు రైతులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అధికారులను కలిసి మరమ్మతులు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఐబీ అధికారులు మరోసారి చెక్‌డ్యామ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కాగా, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## సహకార సంఘంపై విచారణ జరిపించాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న చెన్నారెడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబర్ 21: చెన్నారావుపేట ప్రాథమిక సహకార సంఘంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి జిల్లా సహకార సంఘం అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా సహకార సంఘం కార్యాలయంలో డీసీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 20న సహకార సంఘం కార్యాలయ ఆవరణలో జరిగిన 67వ వార్షిక మహాసభలో మొత్తం సభ్యుల్లో మూడోవంతు సభ్యులు లేకుండానే ఆడిట్ రిపోర్టును ఆమోదించడంపై అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. సంఘంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరినట్లు చెన్నారెడ్డి తెలిపారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

వర్ధన్నపేట, సెప్టెంబర్ 21: విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్ఈ పీ మధుసూదన్‌రావు సూచించారు. వర్ధన్నపేటలోని సబ్‌డివిజన్ కార్యాలయంలో శనివారం ఇంజినీర్లు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ప్రధానంగా గ్రామాల్లో గుర్తించిన ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు, లూజు లైన్లను సరి చేయాలన్నారు. మీటర్లు లేని గృహ వినియోగదారులు రూ. 938 చెల్లించి నూతన కనెక్షన్ పొందితే జీరో బిల్లు వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు ఏర్పాట్లు పూర్తి

వరంగల్ లీగల్, సెప్టెంబర్ 21: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీవీ నిర్మలా గీతాంబ, హనుమకొండ ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి బీ అపర్ణాదేవి తెలిపారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టుల్లో, నర్సంపేట, పరకాల మండల కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కక్షిదారులు సాయంత్రం 5 గంటల్లోపు ఏ రోజైనా రాజీ కుదుర్చుకునేలా ప్రీ లోక్ అదాలత్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రీ- లిటిగేషన్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## 24న బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్, సెప్టెంబర్ 21 : జీడబ్ల్యూఎంసీ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి ప్రకటించారు. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన బల్దియా కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

## నేడు, రేపు జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 21: ఈ నెల 26 నుంచి వరంగల్ కేంద్రంగా జరగనున్న అండర్-19 అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొననున్న ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 22, 23వ తేదీల్లో సీకేఎం కాలేజీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. 2005 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన క్రికెట్ క్రీడాకారులు క్రికెట్ యూనిఫాం, సొంత కిట్‌తో పాటు మీసేవ ద్వారా జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, 10వ తరగతి మెమో, స్కూల్ జారీ చేసిన బోనోఫైడ్, మూడేళ్ల ప్రోగ్రెస్ సర్టిఫికెట్ రుజువుతో హాజరు కావాలని కోరారు.

## గుడుంబా తరలిస్తున్న ఆరుగురి అరెస్ట్

ఖానాపురం/సంగెం, సెప్టెంబర్ 21: ఖానాపురం, సంగెం మండలాల్లో గుడుంబా తరలిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి నర్సంపేట-మహబుబాబాద్ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. నాజీతండా శివారులో రెండు బైక్‌లపై 30 లీటర్ల సారాను తరలిస్తున్న కుంపోత్ హతియ, మాలోత్ నీలమ్మ, భూక్యా శంకర్, వీరస్వామిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే, సంగెం మండలంలోని తోట్లతండాకు చెందిన మూడు భిక్షపతి, మూడు శివ వద్ద 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సంగెం ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

రవికుమార్ మృతదేహంపై పూలు చల్లుతున్న నన్నపునేని నరేందర్

## మాజీ ఎమ్మెల్యే నరేందర్ సోదరుడి మృతి

గిర్మాజీపేట, సెప్టెంబర్ 21: వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోదరుడు రవికుమార్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. తన అన్న మరణాన్ని తట్టుకోలేక నరేందర్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మృతదేహంపై పూలు చల్లి నివాళులర్పించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు రవికుమార్ మృతదేహం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెరుకవాడ నుంచి రవికుమార్ అంతిమ యాత్ర సాగింది. కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, టీ రమేశ్‌బాబు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు శిల్పకళాసంపద అద్భుతం

శిల్పకళాసంపదను ఆసక్తిగా చూస్తున్న కేంద్రమంత్రి జార్జికురియన్

గిర్మాజీపేట, సెప్టెంబర్ 21: ఓరుగల్లు శిల్పకళాసంపద అద్భుతమని కేంద్ర మత్స్యకార, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మైనార్టీ వ్యవహారాల సహాయ శాఖ మంత్రి జార్జికురియన్ కొనియాడారు. శనివారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్‌తో కలిసి మధ్యకోటలోని రైతులను కలిశారు. వ్యవసాయ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తర్వాత శిల్పకళా సంపదను తిలకించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కార్పొరేటర్ గందె కల్పన, పాపారావు, కుసుమ సతీశ్, వన్నాల వెంకటరమణ, బాకం హరిశంకర్, గందె నవీన్, రఘునాథరెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

**ఎంజీఎం దవాఖానలో సీసీకి నోటీసు**

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 21: ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్‌లో సీసీ వంశీ మద్యం మత్తులో విధులు నిర్వర్తించినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి శుక్రవారం రాత్రి తాత్కాలికంగా విధులను మార్పు చేశారు. ఈ సందర్భంగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సదరు ఉద్యోగి లిఖితపూర్వక వివరణను శనివారం అందజేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

**చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం**

కాశీబుగ్గ, సెప్టెంబర్ 21: వరంగల్ 19వ డివిజన్ కోటిలింగాల ఆలయ రోడ్డులోని దుస్సకుంట బతుకమ్మ చెరువులో శనివారం వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. మంత్రి కొండా సురేఖ ఆదేనుసారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఇటీవల దుస్సకుంటను సందర్శించారు. చెరువు కబ్జాకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేసి గుర్రపు డెక్కతోపాటు చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించారు. బతుకమ్మ వేడుకలకు మంత్రి రూ. 3.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

**'బాలికలకు మూత్రశాలలు నిర్మించాలి'**

గిర్మాజీపేట, సెప్టెంబర్ 21: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు మూత్రశాలలు నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేడల ప్రసాద్ కోరారు. శనివారం ఆయన పార్టీ బాధ్యులతో కలిసి కలెక్టర్ సత్య శారదను తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మేకల సుమన్, రాష్ట్ర కార్యదర్శి పొదిల సాయిబాబా, డీఎస్‌పీ జిల్లా నాయకులు మురళీకృష్ణ, రవి, శ్రవణ్, బాబు, యాకూబ్, ఉమ్మడి జిల్లా స్టూడెంట్ యూనియన్ ఇన్‌చార్జి పురెల్ల విష్ణు, తిరుపతి పాల్గొన్నారు.

**ట్యానరీ అండ్ లెదర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కొత్తూరి యాకేందర్**

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 21: తెలంగాణ ట్యానరీ అండ్ లెదర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా, తెలంగాణ చర్మకారుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్‌గా వరంగల్ దేశాయిపేటకు చెందిన కొత్తూరి యాకేందర్‌ను నియమించారు. ఈ మేరకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవన్‌లో శనివారం జరిగిన సదస్సులో ఆయనకు నియామక పత్రాన్ని తెలంగాణ చర్మకారుల సంఘాల జేఏసీ డాక్టర్ ఆరెపల్లి రాజేందర్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాజమౌళి, కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ అందజేశారు.